క్లుప్తంగా

ధనుర్మాస పూజలు



వినుకొండ(నూజెండ్ల): ధనుర్మాసం ప్రారంభం సందర్భంగా నూజెండ్లలోని లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు రామ్మోహనాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

సచివాలయాల వద్ద నిత్యావసరాలు పంపిణీ

బొల్లాపల్లి: నిత్యావసర సరుకుల పంపిణీ అదనంగా పొడిగించామని తహసీల్దార్ ఎం.దుర్గేశ్వరరావు తెలిపారు. మండలంలోని ప్రతి సచివాలయం వద్ద ఎండీయూ వాహనాల ద్వారా సరుకుల పంపిణీ చేస్తామని తెలిపారు. ఆది, సోమవారాలు రెండు రోజుల పాటు ఆయా సచివాలయాల వద్ద చౌకధరల దుకాణాల్లో సరుకులు తీసుకోని రైస్‌కార్డుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని తహసీల్దార్ సూచించారు.

అంగన్‌వాడీ సెంటర్లు పూర్తిస్థాయిలో నిర్వహిస్తాం

బొల్లాపల్లి: మండలంలోని అంగన్‌వాడీ సెంటర్లు పూర్తిస్థాయిలో పనిచేసే విధంగా చర్యలు చేపడుతున్నామని ఇన్‌చార్జి ఎంపీడీఓ షేక్ జిలానీబాషా ఆదివారం తెలిపారు. ఇటీవల అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సమ్మె చేస్తున్న కారణంగా సెంటర్లు మూతపడ్డాయని, జిల్లా కలెక్టర్ మౌఖిక ఆదేశానుప్రకారం తిరిగి సెంటర్లు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధుల సహకారంతో డ్వాక్రా గ్రూపు సభ్యుల నిర్వహణతో ఈ అంగన్‌వాడీ సెంటర్లను పూర్తిస్థాయిలో పనిచేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయా గ్రామ పంచాయతీల్లో పంచాయతీ, సచివాలయ కార్యదర్శులను అంగన్‌వాడీల నిర్వహణపై ఇన్‌చార్జిలుగా నియమించినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ తెలిపారు. ఈ సెంటర్లలో చిన్నారులకు భోజనం, వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా అందించే ఆహారపదార్థాలను గర్భిణులు, బాలింతలకు అందజేస్తామని వివరించారు.

విద్యార్థులకు గణిత ప్రతిభా పరీక్షలు



శావల్యాపురం: శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా డిసెంబరు 22 జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని సుచరిత ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో గణిత ప్రతిభా పరీక్షలు శ్రీరామ పబ్లిక్ స్కూల్లో ఆదివారం నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో 3 నుంచి 8వ తరగతి వరకు చదివే విద్యార్థులు మొత్తం 429మంది ఈ పరీక్షకు హాజరైనట్లు పాఠశాల కరస్పాండెంట్ కె.వి.ఆర్.మోహన్‌చంద్ తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ మేధావి శ్రీనివాసరామానుజన్ జన్మదినాన్ని జాతీయ గణిత దినోత్సవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. శావల్యాపురం, పోట్లూరు హైస్కూళ్ల హెచ్ఎంలు కె.శ్రీనివాసరావు, గురుబాబు, కనకరత్నం, శ్రీరామ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ కె.అజిత్‌చంద్, ప్రిన్సిపాల్ కె.రత్నకుమారి పాల్గొన్నారు.

టౌన్ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు



చిలకలూరిపేట: క్రీస్తు ప్రబోధాలు సర్వదా ఆచరణీయమని రెవరెండ్ నల్లపు మరియదాసు చెప్పారు. పట్టణంలోని బ్యాంకు కాలనీలో ఉన్న ట్రినిటీ లూథరన్ టౌన్ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు ఏర్పాటు చేశారు. మరియదాసు మాట్లాడుతూ ద్వేషించేవారిని సైతం ప్రేమించటమే క్రీస్తు తత్వమని వివరించారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ సాటివారిని ప్రేమిస్తే ఎలాంటి వైషమ్యాలు లేకుండా అందరూ సుఖసంతోషాలతో జీవించవచ్చని వెల్లడించారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు పాల్గొన్నారు.

ధనుర్మాసం సందర్భంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

మాచర్ల: పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం ధనుర్మాస పూజలు శ్రవణా నక్షత్రం పురస్కరించుకొని పుష్పయాగం నిర్వహించారు. కల్యాణ నిర్వాహణ అధ్యక్షులు పోలిశెట్టి పిచ్చయ్య, సభ్యులు కొత్తమాసు బ్రహ్మారావు, కజ్జం గురవయ్య, సూరే యలమంద, భవనాసి రామ్మూర్తి, గౌరు సుబ్బారావు, తొండపు శ్రీనివాసరావు, పోలిశెట్టి లింగేశ్వరరావు, పోలిశెట్టి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అర్చకులు పూజా కార్యక్రమాలు జరిపారు. పుష్పయాగం అనంతరం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో 3వేల మందికి అన్నదానం జరిపారు. కార్యక్రమంలో అర్చకులతో పాటు దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కె.వీ రాంజనేయరెడ్డి, కౌన్సిలర్ గట్లకోటిరెడ్డి,వెంకటేశ్వర్లు,నాయకులు పాల్గొన్నారు.

ఆత్మశుద్ధి, ఏకాగ్రతే భక్తిభావానికి మూలం



భవన శిలాఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి విడదల రజిని



కార్యక్రమానికి హాజరైన మంత్రి రజిని, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లెల రాజేష్‌నాయుడు, ప్రజాప్రతినిధులు

జైనుల ధ్యాన మందిరాన్ని ప్రారంభించిన మంత్రి విడదల రజిని

యడ్లపాడు: మతమేదైనా..భగవంతుడెవరైనా ఆత్మ పరిశుద్ధత, ఏకాగ్రతతో ధ్యానించడమే భక్తికి మూలం అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖమంత్రి విడదల రజిని చెప్పారు. మండలంలోని వంకాయలపాడు గ్రామం పరిధిలోని 16వ నంబర్ జాతీయ రహదారి పక్కన జైనులు నూతనంగా నిర్మించిన 'శ్రీరాజ రాజేంద్ర విహార థామ్' ధ్యాన మందిరాన్ని జైన ఆధ్యాత్మిక గురువులు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లెల రాజేష్‌నాయుడుతో కలిసి ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ మౌనం, ధ్యానం, క్షమ, మితహారం, ఉపవాసం, శాకాహారం, సంయమనం, అహింసా వంటి సద్గుణాలు కలిగిన జైనమతం ప్రాచీనమైనదన్నారు. ఆధ్యాత్మిక మార్గంలో జీవితాన్ని అంకితం చేసే జైనులు చేపట్టే దీక్ష (బ్రహ్మచర్యం) ఎంతో కఠోరమైనదన్నారు. సూక్ష్మజీవనమే పవిత్రమైనదని గట్టిగా విశ్వసించే వారన్నారు. దీక్షలు చేపట్టిన వారు కాలిబాటన వెళ్లే సమయంలో వారికి ఉపయోగపడేలా ఈ ధ్యాన మందిరాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ముందుగా మంత్రి రజిని, మల్లెల రాజేష్ నాయుడులకు జైనులు తమ సంప్రదాయ పద్ధతిలో ఘనస్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఘంటా శంకర్, జేసీఎస్ కన్వీనర్ రాచమంటి చింతారావు, సర్పంచ్ వడ్డెపల్లి నరసింహారావు, జడ్పీటీసీ ముక్తా వాసు, సొసైటీ చైర్మన్ బి.శివరామకృష్ణ, నాయకులు మాదం శ్రీను, కె.సుబ్బారావు, షేక్ ఖాదర్‌బాష, ఆలోకం వెంకట లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం

గంజి చిరంజీవి నియామకంపై చేనేత సంఘ నాయకుల హర్షం



మాట్లాడుతున్న అవ్వారు అన్నప్పశెట్టి, నాయకులు

చిలకలూరిపేట: మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్తగా గంజి చిరంజీవిని నియమించటంపై చేనేతలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటారని వైఎస్సార్ సీపీ చేనేత విభాగం 5వ జోనల్ ఇన్‌చార్జి అవ్వారు అన్నప్పశెట్టి చెప్పారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ చేనేత విభాగం నాయకులు ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేతలకు రాజ్యాధికారం కల్పించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టడంపై కృతజ్ఞతలు తెలిపారు. గంజి చిరంజీవి రాజకీయ ఉన్నతికి చేనేత వర్గీయులంతా చిత్తశుద్ధితో కృషి చేస్తామని వెల్లడించారు. చిలకలూరిపేట సమన్వయకర్తగా నియమితులైన మల్లెల రాజేష్‌నాయుడు విజయానికి తమ వంతు పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామని చెప్పారు. సమావేశంలో సంఘ నాయకులు ఆరుగళ్ల బ్రహ్మం, గోలి వెంకటేశ్వర్లు, దామర్ల నాగేశ్వరరావు, ప్రగడ నాగేశ్వరరావు, ఆరుగళ్ల నరసింహారావు, దామర్ల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గోవులను సంరక్షించటం పూర్వజన్మ సుకృతం

ఆవుల సత్రంలో గోశాల నూతన షెడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి



నూతన గోశాలలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి, సత్రం ప్రతినిధులు

నరసరావుపేట: గోవులను సంరక్షించటం పూర్వజన్మ సుకృతమని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సత్తెనపల్లి రోడ్డులో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి గో సంరక్షణ సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆవుల సత్రంలో నూతనంగా రూ.లక్షల వ్యయంతో నిర్మించిన రేకుల షెడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని రిబ్బన్‌కట్‌చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే సుమారు 120 గోవులను సంరక్షిస్తున్న ఆవుల సత్రం నిర్వాహకులు పుణ్యాత్ములు అని అన్నారు. మరిన్ని గోవుల సంరక్షణ కోసం మరో షెడ్డు నిర్మాణం చేయటం అభినందనీయం అన్నారు. గోశాలలో పూజలు చేశారు. దాతలు, నిర్వాహకులను సన్మానించారు. గోసంరక్షణ సంఘం కమిటీ సభ్యులు మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, కపలవాయి విజయకుమార్, పెనుగొండ వెంకటేశ్వరరావు, చిలకల గురవయ్య, చలువాది బ్రహ్మయ్య, చేబ్రోలు పుల్లారావు, పాల్వాది అశోక్‌కుమార్, మాజీ పీపీ కాకుమాను బాలహనుమంతారెడ్డి, సారథి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రెడ్డిపాలెంలో మెగా వైద్యశిబిరం



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ గుజ్జుల వెంకట కృష్ణారెడ్డి

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం గ్రామంలో డాక్టర్ గుజ్జుల వెంకట కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. 400 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ చేశారు. రోగులకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ల్యాప్రోస్కోపి చికిత్సలు అవసరమైన వారికి ఉచితంగా నిర్వహిస్తామని డాక్టర్ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ వైద్యశిబిరంలో అడ్వాన్స్ ల్యాప్రోస్కోపి సర్జన్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, ఎముకలు, కీళ్ల వైద్యనిపుణులు డాక్టర్ వంశీనాథ్‌రెడ్డి, స్త్రీ పసూతి వైద్యనిపుణులు డాక్టర్ వసంతరాయ, కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఫణీంద్రారెడ్డి, చర్మవ్యాధుల వైద్యనిపుణులు డాక్టర్ కె.శృతి, చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ ప్రత్యూష లంకా వైద్యసేవలు అందించారు. గ్రామస్తులు సహకారాన్ని అందించారు.

వైద్య వృత్తిలో హాస్పిటల్ సిబ్బంది పాత్ర కీలకం



కాంపౌండర్‌లు, నర్సులతో వైద్యులు

ఐఎంఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గుండ్లపల్లి శ్రీధర్

సత్తెనపల్లి: వైద్య వృత్తిలో హాస్పిటల్ సిబ్బంది పాత్ర ఎంతో కీలకమైనదని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) ప్రధాన కార్యదర్శి డాక్టర్ గుండ్లపల్లి శ్రీధర్ అన్నారు. పట్టణంలోని వేద కళాశాలలో సత్తెనపల్లి ప్రైవేట్ వైద్యశాలల కాంపౌండర్, నర్సుల నూతన కార్యవర్గం సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశానికి గీతా మల్టీ స్పెషాల్టీ వైద్యశాల డైరెక్టర్ డాక్టర్ గీతా హాసంతి అధ్యక్షత వహించారు. డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ వైద్యశాలలో నర్సులు, కాంపౌండర్‌లు చాలా కీలకమన్నారు. రోగులకు నిరంతరం అందుబాటులో ఉండేవారు సిబ్బందేనన్నారు. ఆపదలో వచ్చే రోగులకు ముందుగా స్వాంతన కలిగించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతి ఒక్కరూ వృత్తిపట్ల అంకితభావంతో పనిచేయాలన్నారు. వంశీ స్పెషాలిటీస్ వైద్యశాల డైరెక్టర్ డాక్టర్ షకీలా శ్రీధర్ మాట్లాడుతూ వైద్య సిబ్బంది, వైద్యులు అవినాభావ సంబంధం కలిగి ఉండాలన్నారు. రోగుల పట్ల ప్రేమతో ఉండటం ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలన్నారు. సత్తెనపల్లిలో నూతనంగా నర్సు, కాంపౌండర్ యూనియన్ ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. యూనియన్‌కి ఐఎంఏ అండగా ఉంటుందన్నారు. అందరూ సంఘటితంగా ఉండాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం గౌరవ అధ్యక్షుడిగా ఎం.హనుమంతరావు, అధ్యక్షుడిగా ఎస్ఎం రఫీ, కార్యదర్శిగా సీహెచ్ శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్‌గా షేక్ వలి, సహాయ కార్యదర్శిగా ఎస్.ప్రసన్నకుమార్, కోశాధికారిగా టి.యేసురంజిత్‌కుమార్, ఎం.లక్ష్మి, లక్ష్మీనాగమల్లేశ్వరి, కె.పుల్లారావు, జి.పిచిరెడ్డి, చిన్ననాయక్‌లు ఎన్నికయ్యారు. సమావేశంలో వైద్యులు డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ ఎస్.రాజమోహన్‌రెడ్డి, డాక్టర్ పోట్ల అరుణకుమారి, డాక్టర్ మంత్రూ నాయక్, కాంపౌండర్‌లు, నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులను కించపరచడం సరికాదు

ముప్పాళ్ల: ప్రభుత్వ ఉద్యోగులైన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులపై అంగన్‌వాడీ కార్యకర్తలు చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పరిమి రాంబాబు కోరారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం పక్కన పెట్టి సచివాలయ ఉద్యోగులను కించపరిచే విధంగా మాట్లాడటం ఎంత వరకు సమంజసమన్నారు. వారి హక్కుల కోసం పోరాడటంలో తప్పు లేదు కానీ తోటి ఉద్యోగులపై విమర్శలు చేయటం సరికాదన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వ నోటిఫికేషన్ ద్వారా పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరచి ఎంపికయ్యారనే విషయాన్ని గుర్తించాలన్నారు. జాబ్‌చార్ట్ ప్రకారం కేటాయించిన విధులు నిర్వహించడం ఉద్యోగిగా మా కర్తవ్యమని, ప్రభుత్వం అందించే సేవలన్నీ పారదర్శకంగా అందిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి బాధ్యతలను అప్పగించినా వాటిని సక్రమంగా సకాలంలో అమలు పరుస్తూ ప్రజలకు సేవ చేయడంలో ముందు ఉండి సేవచేస్తున్నామన్నారు. అటువంటి వ్యవస్థను తూలనాడటం సరికాదన్నారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

క్రీస్తు జీవితమే ఒక సందేశం

అడిషనల్ ఎస్పీ మాతంగి అశోక్ కుమార్



సత్తెనపల్లి: మానవజాతికి ప్రేమ మార్గాన్ని చూపడానికే జీసస్ అవతరించాడని, ఆయన జీవితమే ప్రపంచ శాంతికి ఒక సందేశం అని అడిషనల్ ఎస్పీ మాతంగి అశోక్ కుమార్ అన్నారు. మాల మహానాడు సత్తెనపల్లి నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని పరివర్తన పాఠశాలలో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణకుమార్ మాట్లాడుతూ క్రీస్తు యొక్క జననం మానవాళి మనుగడకు స్ఫూర్తి దాయకమన్నారు. ముందుగా సభా పరిచయం మాల మహానాడు నియోజకవర్గ అధ్యక్షుడు గుంటూరు ఆశీర్వాదం చేపట్టగా, సభాధ్యక్షులుగా ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కేబీఆర్‌జే ప్రసాద్ వ్యవహరించారు. సీయోన్ లూథరన్ దేవాలయం సంఘ కాపరి రెవ పి.స్వరూపకుమార్, రెవ. జి.దయానందంలు క్రిస్మస్ సందేశాన్ని అందించారు. ముందుగా క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సత్తెనపల్లి రూరల్ సీఐ పీ ప్రేమయ్య, మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోదాజాన్‌పాల్, జలవనరుల శాఖ ఏఈ దూమాల సుందరరావు, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు ధారా హేమప్రసాద్, పట్టణ అధ్యక్షుడు కూచిపూడి జాన్‌బాబు, ఉద్యోగ సంఘాల ప్రెసిడెంట్ మాలే మరియదాసు, బిల్లా మేరీ, మాల మహానాడు నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ మాలే కిరణ్ కుమార్, న్యాయవాదులు కాశిమాల మార్క్, చిన్నం మణిబాబు పాల్గొన్నారు.

మొసలి ఉన్నది.. జాగ్రత్త..



గురజాల : నగర పంచాయతీలోని లక్ష్మీటాకీస్ సెంటర్ వద్ద గల హద్దులకుంట వద్ద మొసలి సంచరిస్తున్న విషయం విదితమే. విషయం తెలుసుకున్న నగర పంచాయతీ, ఫారెస్టు అధికారులు ఆ ప్రాంతంలో నాలుగు వైపులా మొసలి సంచరిస్తుంది జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. హద్దులకుంటను దైద ఫారెస్టు బీట్ ఆఫీసర్ నాగేశ్వరరావు, నగర పంచాయతీ కమిషనర్ బి.మోహన్ శ్రీనివాస్‌లు పరిశీలించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులకు తెలిపారు.

పెన్షనర్లు సమాజ హితానికి కృషి చేయాలి

ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్

చిలకలూరిపేట: పెన్షనర్లు తమ అనుభవాన్ని సమాజ హితానికి ఉపయోగించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల రీజినల్ కో-ఆర్డినేటర్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ చెప్పారు. ఏపీ ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ చిలకలూరిపేట యూనిట్ ఆధ్వర్యంలో పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో 75 సంవత్సరాలు దాటిన పెన్షనర్లకు ఆదివారం సన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ ఉద్యోగంలో చేరిన నాటి నుంచి ప్రభుత్వ ఉద్యోగులుగా విశేష సేవలు అందించి సమాజాభివృద్ధికి కృషి చేసిన వారిని సముచితంగా గౌరవించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వీరి ద్వారా ఎంతోమంది ప్రయోజకులయ్యారని వెల్లడించారు. సమాజంపై ఎంతో అవగాహన ఉన్న పెన్షనర్లు వారి అనుభవం ప్రజలకు అందించాలని, దిశా నిర్దేశం చేయాలని చెప్పారు. పెన్షనర్లు ఆరోగ్య విషయాలపై జాగ్రత్తలు పాటిస్తూ యోగా, నడక వంటివి చేయాలని సూచించారు. అనంతరం 75 సంవత్సరాలు దాటిన పెన్షనర్లను ఘనంగా సన్మానించారు. పెన్షనర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు లంకా ఆదినారాయణరెడ్డి, అధ్యక్షుడు కందిమళ్ల మురళీధరరావు, కార్యదర్శి బిట్రా నాగేశ్వరరావు, పారిశ్రామిక వేత్త లంకా రఘురామిరెడ్డి, అసోసియేషన్ నాయకులు కనుమూరి జాషువా, జి.వెంకటేశ్వరరావు, పి.అంజయ్య, ఈశ్వరరెడ్డి, మాధవరెడ్డి పాల్గొన్నారు.

వినుకొండ(నూజెండ్ల): ఆల్ ఇండియా పెన్షనర్ల దినోత్సవం, 16వ వార్షిక సమావేశం స్థానిక విశ్రాంతి ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పెన్షనర్ల పితామహుడు డి.ఎస్.నకరా చిత్రపటానికి సంఘ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘ సహాధ్యక్షుడు భువనగిరి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ డీఎస్ నకరా సుప్రీంకోర్టులో దావా వేసి చారిత్రాత్మక తీర్పు వచ్చేందుకు ఎంతో కృషి చేశారన్నారు. అనంతరం 75 సంవత్సరాలు నిండిన పెన్షనర్ దంపతులను, పలువురిని శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించి మెమోంటోలు అందజేశారు. అధ్యక్షుడు గాదె కృష్ణారెడ్డి, ప్రధానకార్యదర్శి కె.కృష్ణమూర్తి, ఎస్‌బీఐ మేనేజర్ వి.శ్రీనివాసరావు, కోశాధికారి కె.వి.రాఘవయ్య, ఎం.వి.సుబ్బయ్యశర్మ, ఎంవీ శర్మ, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

గణపవరంలో...

నాదెండ్ల: గణపవరం పెన్షన్ దారుల భవనంలో ఆదివారం జాతీయ పెన్షన్‌దారుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు కెల్లంపల్లి అచ్చయ్య, సువర్చల, టి.జయలక్ష్మితో పాటు నకిరికల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎంగా పనిచేస్తున్న తుర్లపాటి నగేష్‌ను పూలమాలలు, శాలువలతో యూనియన్ నాయకులు సత్కరించారు. నూతన వస్త్రాలను బహూకరించారు. గణపవరం పెన్షనర్స్ సంఘం అసోసియేషన్ అధ్యక్షురాలు తెలికేపల్లి హైమవతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పెన్షన్ దారుల సమస్యలపై మాట్లాడారు. ప్రభుత్వం నుంచి పెన్షనర్లకు అందాల్సిన బకాయిలు, హెల్త్ స్కీమ్ తదితర అంశాలపై చర్చించారు. అసోయేషన్ కార్యదర్శి కె.సూర్యప్రకాశరావు, మాజీ అధ్యక్షుడు తొండెపు రాధాకృష్ణయ్య, కెల్లంపల్లి రెడ్డియ్య మాస్టర్ పాల్గొన్నారు.

'కే-రిడ్జ్'లో ఉన్నతి ఫెస్ట్



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న చైర్మన్ నాతాని, ప్రిన్సిపాల్ మల్లేశ్వరి, అకడమిక్ డైరెక్టర్ కల్నల్ రవిశంకర్

నరసరావుపేట ఈస్ట్: కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ల ఆధ్వర్యంలో నెలకొల్పుతున్న కే-రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో ఈనెల 23, 24తేదీలలో రెండురోజుల పరిచయ వేదిక ఆట-పాట, చదువు-సంధ్య కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్కూల్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. ఈమేరకు గుంటూరురోడ్డు సాయిబాబా ఆలయం ఎదురుగా ప్రారంభిస్తున్న స్కూల్‌లో కార్యక్రమ వివరాలతో కూడిన ఉన్నతి బ్రోచర్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరి, అకడమిక్ డైరెక్టర్ కల్నల్ వాసిరెడ్డి రవిశంకర్‌తో కలసి ఆవిష్కరించారు. చైర్మన్ నాతాని మాట్లాడుతూ, చిన్నారుల నైపుణ్య ప్రదర్శన, వారిలో దాగిఉన్న ప్రతిభను తెలుసుకునేందుకు తల్లిదండ్రులకు ఉన్నతి పరిచయ వేదిక దోహదపడుతుందని వివరించారు. ఉన్నతి కార్యక్రమాలలో భాగంగా మొదటిరోజు 8 నుంచి 14 సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు రోబోటిక్ వర్క్‌షాప్- శిక్షణ, రెండవరోజు రోబోటిక్ గేమ్స్, రన్నింగ్, ఆల్ఫాబెట్ రన్నింగ్, మాస్టర్ అండ్ మిస్ నరసరావుపేట, మెహిందీ, రంగోలి, పెయింటింగ్ పోటీలను వయస్సుల వారీగా నిర్వహించనున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పోటీలో పాల్గొనేలా చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొనే వారు ఫ్రీ రిజిస్ట్రేషన్‌కు 9000592020, 7400286394 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

లక్ష్మీనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీనారాయణస్వామి



బ్రహ్మోత్సవాలకు హాజరైన భక్తులు

సత్తెనపల్లి: మండలంలోని అబ్బూరు గ్రామంలో లక్ష్మీనారాయణ స్వామి వారి వార్షిక త్రయాహ్నిక బ్రహ్మోత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా సుప్రభాత సేవ, తీర్థం బిందె తెచ్చుట, విశేష ప్రాతఃకాలర్చనం, మామిడి తోరణాలు కట్టుట, పెండ్లి కుమారుని, పెండ్లి కుమార్తెలను చేయుట, మూలమూర్తికి సర్వాంగ రజిత కవచధారణ, విశేష పూజ, తులసి పూజ నిర్వహించారు. అలాగే సాయంత్రం విష్వక్సేన పూజ, పుణ్యాహావాచనం, దీక్షాధారణ, అఖండ స్థాపనం, మృత్సంగ్రహణం, అంకురార్పణం, అగ్నిప్రతిష్ఠ, హోమ కార్యక్రమం, భేరీ పూజ, ధ్వజారోహణం, దేవతాహ్వానం, సంతానము లేని వారికి గరుడ ప్రసాద వితరణ చేపట్టారు. మొత్తం మూడు రోజులపాటు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సోమవారం శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీనారాయణ స్వామి వారి కళ్యాణం నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉక్కు సత్యాగ్రహం సినిమా బస్సు ప్రదర్శన



పట్టణంలో ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

పిడుగురాళ్ల: పట్టణంలోని జయలక్ష్మీ పిక్చర్ ప్యాలెస్ సినిమా హాల్ నందు ఆదివారం తెలుగు సేన ఆధ్వర్యంలో నిర్మించిన ఉక్కు సత్యాగ్రహం సినిమా బస్సు ప్రదర్శన నిర్వహించారు. సినిమా హీరో సత్యారెడ్డి, గంగమహల్ సుబ్బారావులు మాట్లాడుతూ.. విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయకుండా నిర్వహించే ఉద్యమంలో భాగంగానే ఈ సినిమా నిర్మాణం జరిగిందని తెలియజేశారు. ప్రజాగాయకుడు గద్దర్ నటించిన ఆఖరి చిత్రం ఈ ఉక్కు సత్యాగ్రహం సినిమా అని తెలియజేశారు. పల్నాడు ప్రాంతంలోని అన్ని మండల కేంద్రాల్లో ఈ సినిమాకు సంబంధించిన బస్సు ప్రదర్శన ఏర్పాటు చేయబడిందని వారు తెలియజేశారు.

ఉక్కు సత్యాగ్రహం ప్రచార కార్యక్రమం

మాచర్ల: పల్నాడు జిల్లాలోని మాచర్ల నియోజకవర్గానికి చెందిన దర్శక నిర్మాత పులుసు సత్యనారాయణ, స్వర్గీయ గద్దర్ నటించిన విశాఖ ఉక్కు ఆంధ్రా హక్కులో భాగంగా రెండవ విడత మాచర్ల పట్టణంలో ప్రచార యాత్ర ఆదివారం చేపట్టారు. సత్యారెడ్డి అభిమానులు సత్యాగ్రహంతో కూడిన టీ షర్టులు, జెండాలు పట్టుకొని ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలంతా ప్రచార యాత్రను ఆసక్తిగా గమనించి స్వర్గీయ గద్దర్‌కు జే జేలు పలుకుతూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు యువకులు, అభిమానులు పాల్గొన్నారు.